క్లుప్తంగా

వరద ప్రాంతాల్లో సేవలు

కడప కార్పొరేషన్: విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో కడప నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టారు. వరద ప్రాంతాల్లో కడప నగరపాలక సంస్థ ప్రత్యేకంగా దోమల నివారణ చర్యలు చేపట్టింది. మురికినీటిలో బ్లీచింగ్ చల్లారు. పెద్ద కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడం ద్వారా నీటి నిల్వలు లేకుండా చేశారు. వరద బాధితులకు తాగు నీటి సరఫరా, తాత్కాలిక నివాస ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో కడప నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులు, ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

మారెమ్మ తల్లి సన్నిధిలో జిల్లా జడ్జి



జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవికి ప్రసాదాన్ని అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

కడప కల్చరల్ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి శుక్రవారం స్థానిక ఎర్రముక్కపల్లెలోని శ్రీ జగన్మాత మారెమ్మతల్లిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు, న్యాయవాది సట్టి భారవి, పర్యవేక్షకులు ఎస్.భాస్కర్, పూజారిణి మాధవిలు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఆమె అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె పూజలకు హాజరైన స్థానిక భక్తులకు గణపతి మట్టి విగ్రహాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు ఏఓ మోహన్‌రావు, కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షులు గుర్రప్పనాయుడు, మధుసూదన్‌రెడ్డి, రాజశేఖర్, వరప్రసాద్ గాంధీ, బాలాజీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అదనపు ఎస్పీ వెంకటరాముడు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని అదనపు ఎస్పీ వెంకటరాముడు తెలిపారు. స్వచ్ఛంద సంస్థల సంయుక్తాధ్వర్యంలో సెప్టెంబరు 9 నుండి 23వ తేదీ వరకు మాదకద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 9న జరిగే అవగాహన కార్యక్రమం, ర్యాలీకి అదనపు ఎస్పీని ఆహ్వానించి ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో జూటూరు విజయ్ కుమార్, సూలం లక్ష్మీదేవి, భువనేశ్వర్ రెడ్డి, వసంత్ , సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ సంపద విలువ తెలియాలి

కడప కల్చరల్ : మన భారతీయ వారసత్వ సంపద ఎంతో గొప్పదని దాని విలువ తెలుసుకొని కాపాడుకోవలసిన అవసరం ఉందని ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి అన్నారు. శుక్రవారం కడప నగరంలోని బాల వికాస్ హైస్కూలులో ఇటీవల సంస్థ నిర్వహించిన పోటీలలో విజేతలైన 8వ తరగతి విద్యార్థి జియోన్ ప్రణుతికి ప్రథమ బహుమతి, 10వ తరగతి విద్యార్థి దీక్షితకు ద్వితీయ బహుమతి ప్రదానం చేశారు. పాఠశాల కరస్పాండెంట్ గంగయ్య, వ్యవస్థాపకులు సుబ్బరాయుడు, ఆచార్యులు ఈశ్వర రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు గురుమోహన్ రెడ్డి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి పాల్గొన్నారు.

ఘన సత్కారం



అవార్డులు పొందిన వ్యాయామ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

కడప స్పోర్ట్స్: ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లా పరిధిలో వ్యాయామవిద్యలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన పలువురు ఫిజికల్ డైరెక్టర్లను ఘనంగా సత్కరించారు. శుక్రవారం కడప నగరంలోని ఏపీ పీఈటీఎస్ అండ్ ఎస్ఏ పీఈ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఏపీ పీఈటీఎస్ అండ్ ఎస్ఏ పీఈ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మిద్దె ప్రవీణ్‌కిరణ్ మాట్లాడారు. అనంతరం సి. నాగేశ్వరరావు, లక్ష్మి, పమీల, రెడ్డయ్య, పార్థసారథి, వీరాంజనేయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అరుణకుమారి పాల్గొన్నారు.

బి. కోడూరు ఎంఈఓపై ఫిర్యాదు

కడప ఎడ్యుకేషన్: బి.కోడూరు ఎంఈఓగా పనిచేస్తున్న ఎం.సునీల్‌పై బద్వేల్ సీఎస్ఐ చర్చి సభ్యులు బెనడిక్ట్, గాంధీలు శుక్రవారం ఆర్‌జేడీ, డీఈఓలకు ఫిర్యాదు చేశారు. బి.కోడూరు ఎంఈఓగా పనిచేస్తున్న సునీల్ ఎస్సీగా ఉంటూ బద్వేల్ నగరంలోని సెయింట్ పాల్స్ చర్చిలో ట్రెజరర్‌గా పనిచేస్తున్నాడన్నారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని వారు ఆర్‌జేడీ, డీఈఓలను కోరారు.

మట్టి గణపతి విగ్రహాలనే వాడాలి



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక మురళీ థియేటర్ సమీపంలో ఆహార్ భవన్, ఎంజాయ్ కర్రీస్ పాయింట్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై భక్తులకు మట్టి విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి, అంజద్‌బాషా మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలను వాడటం వల్ల నీరు, భూమి కాలుష్యం అవుతాయన్నారు. మట్టి విగ్రహాల వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని, వాటినే ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో 23వ డివిజన్ కార్పొరేటర్ తుంగా విజయలక్ష్మి, డివిజన్ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి, వైఎస్సార్‌సీపీ నేతలు పులి సునీల్ కుమార్, యానాదయ్య, టీపీ వెంకట సుబ్బమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుడి విగ్రహాల పంపిణీ



వైవీయూ: వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

వైవీయూ: మట్టి గణపతి ప్రతిమలనే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదామని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం వైవీయూ లలిత కళా విభాగం ఆధ్వర్యంలో వినాయక చతుర్థి సందర్భంగా పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా 'ఎకో ఫ్రెండ్లీ గణేశా' విగ్రహాలను తయారుచేశారు. వీటిని పంపిణీ చేసే కార్యక్రమం లలిత కళల శాఖ విభాగం అధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.



కడప కార్పొరేషన్ : మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రన్

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎకో ఫ్రెండ్లీ మట్టి విగ్రహాలను అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రన్, డీసీపీ సూరజ్ కుమార్‌లు పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పర్యావరణానికి హాని లేకుండా వినాయక ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా. చంద్రశేఖర్ పాల్గొన్నారు.



కడప కల్చరల్: మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న వల్లూరు బ్రహ్మయ్య తదితరులు

కడప కల్చరల్ : పోతుల చిన్న ఓబుల రెడ్డి, కంచమ్మ, సరస్వతమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గణపతి మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. నగరంలోని పోతుల పీవీఆర్ గ్రాండ్ ఇన్ వద్ద సంస్థ చైర్మన్ పోతుల వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ మోరంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డిలు హాజరై 500 విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు.



క్యూబ్స్ గణనాథుడు

కడప నగరానికి చెందిన ఎల్. శ్రీచరణ్ నరసింహ రూబిక్ క్యూబ్స్‌తో వినాయకున్ని తీర్చిదిద్దాడు. ఈయన వినాయక చతుర్థి పురస్కరించుకుని 506 రూబిక్ క్యూబ్స్ వినియోగించి 12 గంటల పాటు శ్రమించి 4.5 అడుగుల ఎత్తు, వెడల్పుతో తీర్చిదిద్దాడు. – కడప స్పోర్ట్స్



పత్ర చిత్ర ఏకదంతుడు

కడప నగరం నెహ్రూ నగర్‌కు చెందిన చిత్రకారుడు రాఘవేంద్రవర్మ వినాయక చవితిని పురస్కరించుకుని ద్రాక్ష ఆకుపై అతి తక్కువ రంగుల్లో గణపతి రూపాన్ని చిత్రించారు. దాంతోపాటు మనీ ప్లాంట్ ఆకులతో గణపతి ఆకారాన్ని కూర్చారు. – కడప కల్చరల్

కాలానుగుణంగా మార్పులు అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్ఐసీ ఎస్‌డీఎం రవికుమార్

కడప కల్చరల్ : పాలసీదారులు ఎల్ఐసీ ఉద్యోగుల పాలిట దేవుళ్ల లాంటివారని, భవిష్యత్తులో ఇన్సూరెన్స్ రంగంలో రానున్న మార్పులకు అనుగుణంగా మనమూ మారాల్సిన అవసరం ఉందని ఎల్ఐసీ ఎస్‌డీఎం రవికుమార్ పిలుపు నిచ్చారు. 68వ బీమా వార్షికోత్సవాల ముగింపు సభకు అయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారం రోజులపాటు జరిగిన ఉత్సవాల కార్యక్రమాలను మార్కెటింగ్ మేనేజర్ శ్యాం సుందర్‌రావు సమీక్షించారు. అనంతరం ఉద్యోగుల కోసం నిర్వహించిన క్విజ్ పోటీలు, రంగోలి, మహిళల స్పోర్ట్స్ కార్యక్రమాలు, సింగింగ్, పిల్లల కోసం నిర్వహించిన డ్రాయింగ్, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలలో విజేతలకు బహుమతులు అందచేసి అభినందించారు. కార్యక్రమాన్ని ప్రోడక్ట్ మేనేజర్ రామకృష్ణ పర్యవేక్షించారు. కార్యక్రమంలో మేనేజర్ సేల్స్ సాల్మన్ రాజు, రఘునాథరెడ్డి, సంఘాల ప్రతినిధులు చంద్రపాల్, అవధాన శ్రీనివాస్, రామాంజనేయులు, గురునాథ చారి, మార్కెటింగ్ టీం వినోద్, సాహెబ్ పీర్, శ్రీకృష్ణ, రాజు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో త్రివిధ దళాల్లో ప్రవేశం



మాట్లాడుతున్న 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సూర్యనారాయణ

వైవీయూ : నేషనల్ కేడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) 'సి' సర్టిఫికెట్ పూర్తి చేసే వారికి త్రివిధ దళాల్లో నేరుగా ప్రవేశం పొందే అవకాశం ఉందని 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎన్. సూర్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. కడప నగరం తెలుగుగంగ కాలనీలో ప్రారంభమైన కంబైన్డ్ ఆన్యువల్ ట్రెనింగ్ క్యాంపులో శుక్రవారం కమాండింగ్ ఆఫీసర్ ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా సీఓ మాట్లాడుతూ క్యాంపునకు విచ్చేసిన ఎన్‌సీసీ కేడెట్స్ క్రమశిక్షణతో శిక్షణ పూర్తి చేయాలన్నారు. అనంతరం కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్స్‌కు డ్రిల్లు, మ్యాప్‌రీడింగ్ తదితర అంశాల్లో శిక్షణ ప్రారంభించారు. కార్యక్రమంలో క్యాంపు డిప్యూటీ కమాండెంట్ లెఫ్టినెంట్ డా. ఆర్. నీలయ్య, ఎన్‌సీసీ అధికారులు లెఫ్టినెంట్ మహేష్, శివరాం, గంగాధర్, పరేడ్ శిక్షకులు సుబేదార్ మేజర్ అనిల్, సీఎల్ఎన్ రెడ్డి, కొండారెడ్డి, కార్యాలయ సూపరింటెండెంట్ సరస్వతి, డేవిడ్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు



విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు

వైవీయూ: విద్యార్థిదశ కీలకమైనదని క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నతశిఖరాలకు చేరుకోవచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫకృద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని ఆదిత్య కల్యాణ మండపంలో శ్రీవివేకానంద జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల ఫ్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థిదశ నుంచే క్రమబద్ధమైన జీవితం అలవాటు చేసుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని అందుకు తగ్గట్టుగా శ్రమించి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. డైరెక్టర్లు డా. ఎన్.పి. మధుసూదన్‌రెడ్డి , జి. వాసుదేవరెడ్డి , డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగమణి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కలందర్ మాట్లాడారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. ఫ్రెషర్స్‌డే సందర్భంగా విద్యార్థినులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు.

ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం



కేంద్రీయ విద్యాలయలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ వేడుకలు

వైవీయూ: కడప నగరంలోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయాలో శుక్రవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాలయ ప్రిన్సిపాల్ మునీష్ మీనా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావడం ద్వారా సమాజం, దేశం అభివృద్ధిలో ముందుంటాయన్నారు. అక్షరాస్యత ప్రాముఖ్యత, దాని ప్రభావం గురించి వివరించారు. అనంతరం విద్యాలయంకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో థామస్‌మస్రో సింగపూర్ టౌన్ వరకు అక్షరాస్యతా చైతన్య ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైటింగ్, పెయింటింగ్ విభాగాల్లో కాంపిటీషన్స్ నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు చవితి సంబరాలు

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని నాగార్జున మోడల్ స్కూల్, గురుకుల విద్యాపీఠ్, నారాయణ స్కూళ్లలో శుక్రవారం ముందస్తు వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్, సిబ్బంది వినాయకుడి ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వినాయకుడి వేషధారణలో వచ్చి అందరినీ అలరించారు.



గురుకుల్ విద్యాపీఠ్ పాఠశాలలో..



నాగార్జున మోడల్ స్కూల్‌లో..



నారాయణ స్కూల్‌లో..